క్లుప్తంగా

ఉపాధ్యాయులకు నేడు సన్మానం

అలంపూర్: ఉత్తమ ఉపాధ్యాయులకు గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ పట్టణంలోని బీఆర్‌ఎస్ ఫంక్షన్ హాల్లో ఉదయం 9గంటలకు ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించనున్నట్లు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా జెడ్పీహెచ్‌ఎస్ క్యాతూర్ పాఠశాలకు చెందిన వి.మాధవి, జీ.కల్యాణి, ర్యాలంపాడు ఎంపీపీఎస్‌కు చెందిన మరియమ్మ, అలంపూర్ హరిజనవాడ ఎంపీపీఎస్‌కు చెందిన శంకరమ్మ, లింగనవాయి ఎంపీపీఎస్‌కు చెందిన హబీబా బేగం, జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో ఎస్‌ఏ గణిత ఉపాధ్యాయుడు మహబూబ్ బాష, జెడ్పీహెచ్‌ఎస్ లింగనవాయి ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు రాజారెడ్డి, గొందిమల్ల ఎంపీయూపీఎస్‌కు చెందిన రాముడు, ఎంపీపీఎస్ ఉట్కూరుకు చెందిన ఎస్‌జీటీ రాజ్‌కుమార్‌లు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

రుణమాఫీ అయ్యేలా చూడండి

శాంతినగర్: వ్యవసాయానికి సంబంధించి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు మాఫీ అయ్యేలా చూడాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాధను ఆయా గ్రామాల రైతులు కోరారు. వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సు గ్రామంలో రుణమాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయశాఖ అధికారులు బుధవారం దరఖాస్తు తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

సరైన ధ్రువపత్రాలు సమర్పించాలి



ఎర్రవల్లి: రుణమాఫీ ఉండి రేషన్ కార్డు లేని రైతులు వ్యవసాయ అధికారులకు సరైన ధ్రువ పత్రాలు అందించాలని ఏఓ రవికుమార్ అన్నా రు. బుధవారం ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం రైతు వేదికలో రుణమాఫీ కానీ రైతుల నుంచి ఏఓ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కానీ రైతులు దరఖాస్తు పత్రంతో పాటు సంబంధిత పత్రాలను తప్పకుండా జత చేసి ఇవ్వాలన్నారు. కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం , రుణఖాతా పుస్తకం, బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను జతచేసి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సంధ్య, రైతులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



అలంపూర్: అలంపూర్ పట్టణంలోని న్యాయవాదుల సమావేశ మందిరంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన మలిపెద్ది సురేష్ కుమార్‌ను వాసవి నిత్యాన్నదాన సత్రం ఉపాధ్యక్షుడు కేకే సత్యనారాయణ, శాంతినగర్ గో సంరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీనివాసులు బుధవారం శాలువాతో సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

అంబులెన్స్‌లో ప్రసవం: తల్లీబిడ్డ క్షేమం



ఉండవెల్లి: మండలంలోని బొంకూరుకు చెందిన రేవతికి పురుటి నొప్పులు రావడంతో 108లో అత్యవసర చికిత్స కోసం మానవపాడు పీహెచ్‌సీకి తరలిస్తుండగా, అమరవాయి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దాటేందుకు వీలుకాలేదు. దీంతో వాగు నుంచి వేరే పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్‌లో రేవతి ప్రసవించింది. మెడికల్ టెక్నీషియన్ శేఖర్, డ్రైవర్ శ్రీశైలం, ఆశా కార్యకర్తలు ఆమెకు సహకరించినట్లు తెలిపారు. వెంటనే ఆమెను వడ్డేపల్లి పీహెచ్‌సీకి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు. తల్లీబిడ్డ సురక్షితంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

కర్ణాటకకు భారీ వినాయకులు

ధరూరు: గద్వాల, కర్నూలు ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన భారీ వినాయకులను కర్ణాటకకు తరలిస్తున్నారు. ధరూరు మీదుగా రాయచూర్‌కు నాలుగు రోజులుగా నిత్యం వందలాది భారీ వినాయక విగ్రహాలను తరలిస్తున్నారు. ధరూరులో వైఎస్సార్ విగ్రహం పక్క నుంచి ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న భారీ వినాయకుడి విగ్రహం విద్యుత్ తీగలకు తగలడంతో మూడు వైర్లు కలిశాయి. దీంతో పెద్ద ఎత్తున శబ్దం వచ్చి కరెంట్ ట్రిప్ అయ్యింది.

పొంగిపొర్లిన చెరువులు, వాగులు



భారీ వర్షానికి కొట్టుకుపోయిన అయిజ-పులికల్ డైవర్షన్ రోడ్డు

- పంటపొలాల్లో నిలిచిన వర్షం నీరు
- స్తంభించిన రాకపోకలు
- కూలిన మట్టి మిద్దెలు..

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి బుధవారం చెరువులు, వాగులు పొంగి పొర్లాయి. పంటపొలాల్లో వర్షం నీరు చేరింది. కంది, మిరప పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన చెందారు. మానవపాడు – గోకులపాడుకు మినీ వంతెనపై, మానవపాడు – అమరవాయికి మినీ వంతెనపై ఉధృతంగా వర్షం నీరు ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని గోకులపాడు, కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్, మద్దూరు, కలుకుంట్ల, అమరవాయి, పెద్దఆముదాపాడు, నారాయణపురం ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు 20కు పైగా ఇళ్లు నేలమట్టమైనట్లు ప్రజలు తెలిపారు. అమరవాయిలో 2, బూడిదపాడులో 2, మల్దకల్‌లో 4, ఉలిగేపల్లిలో 2, ఎల్కూరులో 2, మల్లెందొడ్డి, విఠలాపురం, నాగర్‌దొడ్డి గ్రామాల్లో వర్షాలకు ఇళ్లు కూలిపోయినట్లు బాధితులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు.

మట్టిమిద్దె కూలి ముగ్గురికి గాయాలు

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో ఎస్సీ మాలవీధిలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బుధవారం మట్టిమిద్దె కూలిపడి ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సీకాలనీలో నివాసముంటున్న జోలపురం లక్ష్మీదేవి కుమారుడు శేఖర్, అతని భార్య ప్రశాంతిలకు గాయాలయ్యాయి.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇరువైపుల దారికి అడ్డంగా ముళ్లకంచె వేశారు.

అయిజ: మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు బుధవారం మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రి ముందు కాజ్‌వేపై పెద్దవాగు వరద పొంగింది. దీంతో వాగు దాటేందుకు విద్యార్థులతో పాటు వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు.

కొట్టుకపోయిన డైవర్షన్ రోడ్డు

అయిజ: అయిజ – పులికల్ రోడ్డుపై చేపడుతున్న వంతెన కారణంగా కొన్ని నెలల క్రితం వంతెన పక్కన అధికారులు డైవర్షన్ రోడ్డు నిర్మించారు. ఆగస్టు 21న కురిసిన భారీ వర్షానికి అప్రోచ్ రోడ్డు తెగిపోయింది. అదేనెల 25న అప్రోచ్ రోడ్డును పునః నిర్మించారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మళ్లీ అప్రోచ్ రోడ్డు కొట్టుకపోయింది.

నీట మునిగిన పంటలు

రాజోళి: వర్షాలకు ఆయా గ్రామాల్లో వరి, పత్తి, కంది పంటలు నీట మునిగాయి. మంగళవారం రాత్రి నుంచే వాగుల్లో నీటి ఉధృతి పెరగడంతో రాజోళి, ముండ్లదిన్నె శివారులోని పత్తి, వరి పంటలు నీట మునిగాయి. అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు పంటలను పరిశీలించారు.

నష్టపోయిన పంటల పరిశీలన

మల్దకల్: వర్షాలకు నష్ట పోయిన పంటలను ఏఓ రాజశేఖర్ ఏఈఓతో కలిసి బుధవారం పరిశీలిచారు. ఈ సందర్భంగా ఎల్కూరు, మల్లెందొడ్డి, తాటికుంట, మల్దకల్ గ్రామాలలో నష్టపోయిన పంటలను పరిశీలించి వివరాలను సేకరించారు. అకాల వర్షాలకు ఆయా గ్రామాల్లో 200 ఎకరాలకు పైగా పంటలు నష్టపోయినట్లు అధికారులు తెలిపారు.

ఉండవెల్లిలో 24.8 మి.మీ. వర్షపాతం

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసి 24.8 మి.మీ. నమోదైనట్లు అధికారులు తెలిపారు.



అమరవాయిలో కూలిన ఇల్లు



అయిజలో వాగుదాటుతున్న విద్యార్థులు



ఉండవెల్లి శివారులో మిర్చి పంటలో నిలిచిన నీరు

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ, చెక్కులను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. వడ్డేపల్లి మండలం శాంతినగర్‌కు చెందిన విజయ్‌కుమార్ ఆపరేషన్ కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల ఎల్‌ఓసీ వచ్చిందన్నారు. ఇటిక్యాల మండలం వల్లూరు గ్రామానికి చెందిన రాజగోపాల్‌కు సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చులకు రూ.11వేలు మంజూరైనట్లు తెలిపారు. వారితో పాటు నాయకులు కిషోర్, తదితరులు ఉన్నారు.



సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

మున్సిపల్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

అలంపూర్: మున్సిపల్ కార్మికుల వేతనాలు తక్షణమే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు కమిషనర్ సరస్వతిని కలిసి కార్మికుల వేతనాలపై బుధవారం చర్చించినట్లు తెలిపారు. అనంతరం వేతనాలు తక్షణమే ఇవ్వాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటీలోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో 39 మంది ఔట్ సోర్సింగ్, ప్రైవేటు కార్మికులు పారిశుద్ధ్య పనులు చేస్తున్నట్లు తెలిపారు. వారితో పాటు 22 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని, 16 నెలల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ డబ్బు ఖాతాల్లో జమకావడం లేదని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కార్మికులకు చెల్లించకుండా ఆ నిధులను డీజిల్ ఇతర వాటికి దారి మళ్లించారని పేర్కొన్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు తక్షణమే జీతాలు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో కార్మికులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు చిన్న రాముడు, మున్నిస్వామి, బాలరాజు, సామెల్, వెంకటేష్, శివ, ప్రభుదాస్ ఉన్నారు.



అలంపూర్‌లో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న, కార్మికులు

దాతకు అర్చకుల సత్కారం

అయిజ: ఆలయ పరిసరాల్లో సొంత ఖర్చులతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టిన గద్వాల పట్టణానికి చెందిన లక్ష్మణ్‌ను బుధవారం తుపత్రాల గ్రామంలో శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా దూప, దీప నైవేద్య జిల్లా అధ్యక్షులు చక్రవర్తి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాలలో వెలసిన గుంటి రంగనాథస్వామి ఆలయం ముందు రూ.1,8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించినందుకు లక్ష్మణ్‌ను అభినందించారు.

శాంతియుతంగా గణేశ్ ఉత్సవాలు నిర్వహించాలి

మల్దకల్: మండలంలో గణేశ్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ సురేష్‌గౌడ్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గణేశ్ మండపాల ఏర్పాటుకు స్థల సేకరణతో పాటు గ్రామ పంచాయతీ, విద్యుత్, పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా చూసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఈశ్వరయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

కేటీదొడ్డి: మండలంలో వినాయక చవితి పూజలను శాంతియుతంగా చేసుకోవాలని ఎస్ఐ బీ.శ్రీనివాస్ అన్నారు. పోలీస్ స్టేషన్‌లో అన్ని గ్రామాల గణేష్ మండపాల నిర్వాహకులు, యువకులతో సమావేశం నిర్వహించారు. గణేశ్ మండపాల వద్ద పేకాట, మద్యపానం చేయవద్దన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ బి.శ్రీనివాస్



సంత.. చినుకుల చింత

వారంతపు సంత వర్షం పడడంతో ఆగమాగమైంది. మండల కేంద్రంలో బుధవారం సంతలో సాయంత్రం ఒక్క సారిగా వరుణుడు జోరందుకోవడంతో చిరు వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బంది పడ్డారు. వర్షంతో సంత బజారులో నీరు పారడంతో కూరగాయలు కొట్టుకు పోయాయి. పారుతున్న నీటిలోనే వారానికి సరిపడే కూరగాయలు స్థానికులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. సంత బజారు వర్షపు నీటితో నీటి మడుగును తలపించింది.

– గట్టు

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్‌పోటీలు

గద్వాల: రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా స్థాపించి నేటికి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా క్విజ్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు లీడ్‌బ్యాంకు మేనేజర్ అయ్యపురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనే వారు 25 ఏళ్ల వయసులోపు ఉండాలన్నారు. నాలుగు దశలలో జరిగే ఈపోటీలలో మొదటి దశ జిల్లా, రెండవ దశ, మూడవ జోనల్, నాలుగో దశ దేశస్థాయిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆర్బీఐ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. స్వయంగా పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఈక్విజ్ పోటీలు ఇంగ్లిష్, హిందీ భాషలలో ఉంటాయని తెలిపారు. పోటీలో ఆర్థిక వ్యవస్థ, క్రీడలు, చరిత్ర, సాహిత్యం, సైన్స్, టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ మరియు ఆర్బీఐ డిజిటల్ కరెన్సీకి సంబంధించిన విషయాలు ఉంటాయన్నారు. ఈనెల 17న సాయంత్రం 5గంటల నుంచి 21వ తేదీ మధ్యలో పరీక్ష ఆన్‌లైన్‌లో ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఎప్పుడైనా, ఎక్కడి నుంచైన రాయవచ్చన్నారు. ఈపోటీలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్‌తో పాటు, ప్రైజ్‌మనీ కూడ ఇవ్వడం జరుగుందన్నారు. జాతీయ స్థాయిలో మొదటి బహుమతి రూ.10లక్షలు, రెండోద బహుమతి రూ.8లక్షలు, 3వ బహుమతి రూ.6లక్షలు, జోనల్ స్థాయిలో మొదటి బహుమతి రూ.5లక్షలు, రెండవ బహుమతి రూ.4లక్షలు, రూ.3వ బహుమతి రూ.3లక్షలు, రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ.2లక్షలు, రెండో బహుమతి 1.5 లక్షలు, 3వ బహుమతి రూ.1లక్ష ఇవ్వనున్నట్లు తెలిపారు.

సీపీఎస్‌ను రద్దు చేయండి

శాంతినగర్: ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిన కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీంను రద్దు చేసి (సీపీఎస్ స్కీమ్) ఓల్డ్ పెన్షన్ స్కీంను (ఓపీఎస్ స్కీంను) అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ ప్రభుత్వాన్ని ప్రకటనలో డిమాండ్ చేశారు. యునైటెడ్ పెన్షన్ స్కీం తీసుకురావడం దారుణమని పేర్కొన్నారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగ విరమణ తరువాత ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని, పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

శాంతి భద్రతల పరిరక్షణలో రాజీలేదు

కేటీదొడ్డి: శాంతి భద్రతల పరిరక్షణలో రాజీలేకుండా పనిచేస్తామని ఎస్ఐ బీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎస్ఐగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌రావు జిల్లా డిసిఆర్బీకి బదిలీ కావడంతో బి. శ్రీనివాస్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గుట్కా, పేకాట, ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి వాటిపై ఎట్టి పరిస్థితిలో రాజీపడేది లేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐకి స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

శాంతినగర్: ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ ప్రకటనలో కోరారు. వైద్య శిబిరాలతోపాటు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే అవకాశం



అలంపూర్ కోర్టులో ఉద్యోగులను సత్కరిస్తున్న జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కమలాపురం కవిత

అలంపూర్: విద్యాశాఖలో పని చేయడం అంటే విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే అవకాశం దక్కడమే అని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కమలాపురం కవిత అన్నారు. అలంపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిపెద్ది సురేష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అలంపూర్ కోర్టులో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అయిజ పట్టణానికి చెందిన నరసింహకు పటాన్‌చెరులోని సాంఘిక సంక్షేమశాఖ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిగా ఉద్యోగం లభించినట్లు తెలిపారు. స్థానిక కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గద్వాలకు చెందిన ఫీరోజ్‌కు బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ కళాశాలలో అధ్యాపకుడిగా ఉద్యోగం వచ్చిందన్నారు. ఇద్దరు ఉద్యోగులు న్యాయశాఖ నుంచి విద్యాశాఖలో విధులకు వెళ్తుండటంతో జడ్జి వారిని శాలువాతో సత్కరించారు. న్యాయ శాఖ నుంచి విద్యాశాఖకు వెళ్తున్న ఇద్దరిని బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది ఘనంగా వీడ్కో లు పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిపెద్ది సురేష్ కుమార్, న్యాయవాదులు నాగరాజు, శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

చిన్నోనిపల్లె సమస్యలు పరిష్కరించాలి

గట్టు: చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ నేత బల్గెర హనుమంతునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం చిన్నోనిపల్లె గ్రామాన్ని బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించారు. గ్రామస్తుల ద్వారా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తెల్లవారు జామున రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ ఇండ్ల దగ్గరకు వచ్చినట్లు గ్రామస్తులు బీఆర్‌ఎస్ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఇళ్లకు ఆనుకుని ఉన్న పత్తి పంట నీట మునిగిన విషయాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ముంపు గ్రామాన్ని పునరావాస కేంద్రంలోకి తరలించకుండా రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేయడం ఎంత వరకు న్యాయమని, విష సర్పాలు, పురుగుల మధ్య భయంతో ముంపు గ్రామంలో జీవనం సాగిస్తున్నట్లు నిర్వాసిత కుటుంబాల వారు వాపోయారు. చిన్నోనిపల్లె ముంపు గ్రామ సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నూర్‌పాష, రాజునాయుడు, తిమ్మప్ప గౌడు, వీరేష్, కర్రెప్ప, బొజ్జయ్యనాయుడు, రాయాపురం వీరేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



చిన్నోనిపల్లె గ్రామం పక్కనే నీట మునిగిన పత్తి పంటను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అయిజ: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఎస్ఐ విజయభాస్కర్ అన్నారు. బుధవారం మండలం కేంద్రంలో యువతకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మోటార్ సైకిల్‌పై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లేవారు సీట్ బెల్ట్ ఖచ్చితంగా పెట్టుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త విధానాలతో ప్రజలను మోసం చేస్తున్నారని, మొబైల్ ఫోన్లు ఉపయోగించేవారు జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు చేశారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విజయభాస్కర్

పౌష్టికాహారం తీసుకోవాలి

- సీడీపీఓ నాగరాణి



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ నాగరాణి

మల్దకల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ నాగరాణి సూచించారు. పోషణ మాసంను పురస్కరించుకుని బుధవారం మల్దకల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గర్భిణులతో పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పాలు, గుడ్లు, ఆకుకూరలు ఎక్కువ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారికి అందిస్తున్న పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, అంగన్‌వాడీ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యామిని, అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, మహేశ్వరమ్మ, పుష్పమ్మ, లక్ష్మీరంగమ్మ, సునీత, నవీన, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై ప్రజావేదిక

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో గత నెల 28 నుంచి ఈ నెల 3 వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిర్వహించగా, పంచాయతీ కార్యదర్శులు, టీఏల నిర్లక్ష్యం వల్ల రూ.41వేల జరిమానాన, రూ.71 వేల రికవరీ నిర్వహించినట్లు డీఆర్‌డీఓ నర్సింగరావ్ తెలిపారు. బుధవారం మూడో విడత సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక నిర్వహించగా, 15 గ్రామ పంచాయతీలలో 2023–24కు సంబంధించిన 461 వర్క్‌లు చేశారు. నర్సరీలో 10 వేల మొక్కలలో కేవలం 5 వేల మొక్కలు ఉన్నాయని, పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం అధికంగా ఉందని డీఆర్‌డీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుపతన్న, ఏపీఓలు సౌజన్య, విజయ్‌శంకర్, ఎస్‌ఆర్‌టీ శ్రీకాంత్, డీఈఓ శ్రీనివాస్, క్యూసీలు అశోక్, బీఆర్‌పీలు శంకర్, మహేందర్, అశోక్, అఖిల, శిరీష, కుమార్, హరికుమార్, హరికృష్ణ ఉన్నారు.



ఉండవెల్లిలో ప్రజావేదిక పాల్గొన్న డీఆర్‌డీఓ

ఆదర్శ ఉపాధ్యాయుడు

- పేద విద్యార్థులకు ప్రోత్సాహం
- 24 ఏళ్లుగా ఉదయం 8గంటలకు ప్రత్యేక తరగతులు



మానవపాడులో విద్యార్థులకు ఆంగ్లం బోధిస్తున్న ఉపాధ్యాయుడు వేణుగోపాల్

మానవపాడు: విద్యార్థి దశలో అభివృద్ధి చెందడానికి తల్లిదండ్రుల పాత్ర ఏవిధంగా ఉంటుందో, ఉపాధ్యాయుడి పాత్రకూడా చాలా ముఖ్యమైనది. నేటి ఆధునిక యుగంలో మానవ ఆదర్శాలను, సామాజిక అవసరాలకు అనుగుణంగా లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులకు నమ్మకం కలిగించేవాడు ఉపాధ్యాయుడు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు బీఎన్. వేణుగోపాల్ ఆ కోవకే చెందుతాడు. ఆయన ఉపాధ్యాయ వృత్తి చేపట్టినప్పటి నుంచి నేటి వరకు 24 ఏళ్లుగా 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 8గంటల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాడు. గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల వ్యవహార శైలికి అనుగుణంగా విద్యాబోధన అందిస్తున్నాడు. పోటీ పరీక్షలలో, ఉన్నత చదువులలో ఆంగ్ల భాషకు, ఆంగ్ల వ్యాకరణానికి దాదాపు 25–30 మార్కులు ప్రతి పోటీ పరీక్షలలో ఉంటాయి. పోటీ పరీక్షలలో మార్కులు సాధించే విధంగా విద్యార్థుల భవిష్యత్‌ను నిర్మించుకోవడానికి ఆంగ్లంను సులభశైలిలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాడు.

ప్రోత్సాహక బహుమతులు..

2016 నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉండవెల్లిలో 10వ తరగతి టాపర్స్‌కు మెరిటోరియస్ అవార్డు పేరిట ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నాడు. మొదటి బహుమతి రూ.2116, రెండో బహుమతి రూ.2116, మూడో బహుమతి 1116 అందిస్తూ వారికి మెమోంటో అందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పుల్లూరులో 40–50 మంది విద్యార్థులకు గ్రామర్ పుస్తకాలు అందించాడు. కళాశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఫీజులు, ఎక్జామ్ ఫీజులు, విద్యబోధనకు సంబంధించి ఆర్థికసాయం అందిచడంలో అందరికంటే ముందు ఉంటాడు. 2024లో విద్యార్థిని కె.పూజిత కు బైపీసీలో అడ్మిషన్ ఫీజ్ చెల్లించి చదివిస్తున్నాడు. 24ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటున్న ఆయనను ఆదర్శంగా తీసుకొని ఎంతో మంది శిష్యులు ఉన్నతస్థాయికి ఎదిగారు. ప్రతి విద్యార్థి ఆయనను ఆధునిక ఆదర్శ ఉపాధ్యాయుడంటూ కొనియాడుతున్నారు.